క్లుప్తంగా

ఘనంగా సాయి మందిరం వార్షికోత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీనివాసపురంలో వెలిసిన శ్రీషిరిడీ సాయిబాబా మందిరం 13వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మూలమూర్తి షిరిడీ సాయిబాబాకు విశేష క్షీరాభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. మధ్యాహ్నం హారతి తర్వాత అన్నప్రసాద వితరణ చేశారు. విశ్రాంత డీఎస్పీ వేల్పుల గంగరాజు, లక్ష్మీదేవి, కృష్ణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్టీఐ తిరుమల అధ్యక్షుడిగా సుబ్బరాయల్



తిరుపతి కల్చరల్: ఫోరం ఫర్ ఆర్టీ తిరుమల అధ్యక్షుడిగా ఆవుల సుబ్బరాయల్ నియమిస్తున్నట్లు ఎఫ్ఆర్టీఐ జాతీయ అధ్యక్షుడు పి.చంద్రమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురువారం సంస్థ తిరుపతి కార్యాలయంలో ఆ సంస్థ నేషనల్ జాయింట్ సెక్రటరీ కె.అజయ్‌కుమార్ చేతుల మీదుగా గుర్తింపు కార్డు అందుకున్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఏపి లా సెట్‌లో ఎస్వీజేసీ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి ఎడ్యుకేషన్: ఏపీ లా సెట్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ ఫలితాల్లో ఎల్.గంగాధర్ రాష్ట్ర స్థాయి 86వ ర్యాంకు, వి.లారెన్స్ 313వ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా వారిని ఆ కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

మెరుగైన సేవలు అందిస్తాం



మాట్లాడుతున్న ట్రాయ్ సంస్థ సభ్యుడు చిట్టిబాబు

రామచంద్రాపురం: టెలికాం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్(టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) లక్ష్యమని ఆ సంస్థ సభ్యుడు చిట్టిబాబు అన్నారు. గురువారం మండలంలోని సీరామాపురం కమ్యూనిటీ కేంద్రంలో కాగ్ ఆధ్వర్యంలో టెలికాం కంపెనీల వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 నాటికి గ్రామాల్లోని ప్రతి ఇంటికి బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ కలిగి ఉండే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు.

సురేష్‌బాబుకు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఈసీఈ విభాగం విద్యార్థి పోట్లదుర్తి సురేష్‌బాబుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ప్రొఫెసర్ జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెర్ఫార్మన్స్ ఎనాలసిస్ ఆఫ్ ఎంఎస్టీ రాడార్ యూజింగ్ వేరియస్ వేవ్లెట్స్ విత్ ఓవర్లాప్డ్ గ్రూప్ స్పార్సిటీ అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

నాన్ టీచింగ్ అసోసియేషన్ ఎన్నికల ప్రచారం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో నాన్ టీచింగ్ అసోసియేషన్ ఎన్నికలు వచ్చే నెల 11న నిర్వహించనున్నారు. ఈ మేరకు నామినేషన్ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైనట్లు ఎన్నికల అధికారి ఎం.షఫీ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో వర్సిటీలోని 450 మందికి పైగా బోధనేతర సిబ్బందిని పోటీలో ఉన్న అభ్యర్థులు తమకు మద్దతు తెలపాలని ప్రసన్నం చేసుకుంటున్నారు.

ప్రభాస్ కల్కి చిత్రం విజయం సంతోషకరం

తిరుపతి కల్చరల్: ప్రముఖ హీరో ప్రభాస్ నటించిన కల్కి చిత్రం భారీ విజయాన్ని సాధించడం సంతోషంగా ఉందని సినీ నిర్మాత ఎన్వీ ప్రసాద్ తెలిపారు. గురువారం సాయంత్రం జయశ్యామ్ థియేటర్‌లోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కల్కి సినిమాతో తెలుగు సినీ పరిశ్రమను తలెత్తుకునే స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. గురువారం విడుదలై అన్ని థియేటర్లలో విజయవంతంగా నడుస్తుండడం, ప్రేక్షకులు మరింత మక్కువతో ఆదరించడంతో కల్కి చిత్రం సంచలన విజయం సాధిస్తోందని పేర్కొన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ



నూకలగుంటలో వేరుశనగ విత్తనాల పంపిణీ

చంద్రగిరి: ప్రభుత్వం అందిస్తున్న వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం స్థానికి నూకలగుంట వద్ద ఉన్న రైతు భరోసా కేంద్రం వద్ద ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్‌రెడ్డిలతో కలసి ఆయన రైతులకు వేరుశనగ విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మారుతి, ఎంపీడీఓ డాక్టర్ సూర్యసాయి, డీఏఓ ప్రసాద్ రావు, ఏఓ విజయ్ భాస్కర్, టీడీపీ నాయకులు కుమార్‌రాజా రెడ్డి, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, హేమాంబరధరరావులతో పాటు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శ్రీసుందరరాజ స్వామి అవతార మహోత్సవాలు



పెద్దశేషవాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు



విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీసుందరరాజ స్వామివారి అవతార మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం శ్రీ కృష్ణ స్వామివారి ముఖ మండపంలో శ్రీసుందరరాజ స్వామివారికి వైభవంగా అభిషేకం చేశారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీరు, పసుపు, చందనాలతో వేడుకగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ స్వామివారి ముఖమండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి స్వామివారు పెద్దశేష వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. శుక్రవారం రాత్రి స్వామివారు హనుమంత వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రమేష్, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ శేషగిరి, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగుల సమస్యలపై ఈఓకు వినతి



టీటీడీ ఈఓను కలిసిన టీటీడీ బీసీ ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గ నాయకులు, ఉద్యోగులు గురువారం టీటీడీ ఈఓ జె.శ్యామలరావును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టీటీడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. స్పందించిన ఈఓ ఉద్యోగుల సమస్యలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీటీడీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గ నాయకులు, ఉద్యోగులు రాజ్‌కుమార్, రవీంద్ర బాబు, కామరాజు, డాక్టర్ భరత్ కుమార్, రామచంద్ర, మునికుమార్, కృష్ణయ్య, అనురాధ, గురవయ్య, వెంకటేశ్వర్, రెడ్డప్ప, నాగ శివ శంకర్, వేణుగోపాల్, మనోహర్, లీలా వినోద్, సుబ్రహ్మణ్యం, జయబాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫ్యాన్లు పంపిణీ



దివ్యాంగులకు ఫ్యాన్లు పంపిణీ

తిరుపతి కల్చరల్: దివ్యాంగులకు గురువారం బెడ్స్, ఫ్యాన్లు ఉచితంగా పంపిణీ చేశారు. జీవకోనలోని విశ్వం స్కూల్లో దీన జనసేవా సమితి ఆధ్వర్యంలో నోబుల్ పురస్కార గ్రహీత హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరణి హాజరై దివ్యాంగులకు బెడ్స్, ఫ్యాన్లు అందజేశారు. విశ్వం స్కూల్ అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి, గేట్ విద్యాసంస్థల చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు, టీడీపీ కార్పొరేటర్ అన్నా సంధ్య, కుమారమ్మ, లక్ష్మీపతి, వెంకటేశ్వరరావు, ఇస్కాన్ కార్యదర్శి లీలాపారాయణదాస్ పాల్గొన్నారు.

వైద్య సదస్సు విజయవంతం



గ్లకోమా పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ సుధారాణి

తిరుపతి తుడా: వైద్య విద్య, బోధన విధానాలపై మూడు రోజులపాటు నిర్వహించిన బోధన సదస్సు వర్క్ షాప్ విజయవంతంగా ముగిసిందని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ తెలిపారు. భారత వైద్య విధాన మండలి నూతన అధ్యయనం ద్వారా కొత్త విధానాలకు సంబంధించి నిర్వహించిన ముగింపు సమావేశం గురువారం ముగిసింది. మెడికల్ కళాశాలకు సంబంధించిన 40 మంది వైద్య అధ్యాపకులు ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు సీఎంసీ వైద్య కళాశాల పరిశీలకులు డాక్టర్ సతీష్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య విధానంలో చోటుచేసుకుంటున్న మార్పులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాల్సిన బాధ్యత వైద్య అధ్యాపకులపై ఉందన్నారు. కొత్త విధానాలను ఎప్పటికప్పుడు వైద్య విద్యార్థులకు నేర్పించడం మరిచిపోవద్దని తెలిపారు. వైద్య రంగంలో అనేక సంస్కరణలు, మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ విషయాలపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలని, విద్యార్థులకు మరింత అవగాహన పెంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సునీత, మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ నోడల్ అధికారి డాక్టర్ కిరీటి, ఇతర వైద్యాధికారులు డాక్టర్ ప్రతిభా స్రవంతి, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ ఫాహీమ్ తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి ఏఐఎస్ఎఫ్ జాతీయ సమావేశాలు



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి

తిరుపతి సిటీ: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ సమావేశాలు ఈ నెల 29 నుంచి రెండు రోజులపాటు ఎస్వీ యూనివర్సిటీ వేదికగా నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి తెలిపారు. గురువారం స్థానిక ఎస్వీయూలో జరిగిన ఏఐఎస్ఎఫ్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కార్ విద్యా వ్యవస్థను సర్వనాశనం చేస్తోందని, బడ్జెట్‌లో నిధులు సైతం తగ్గిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ప్రైవేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా జాతీయ సమావేశాల్లో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్, నాయకులు చిన్ని, జిల్లా అధ్యక్షుడు నవీన్, ప్రవీణ్, నగర అధ్యక్షులు హరికృష్ణ, వర్సిటీ నాయకులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి పరీక్ష

సత్యవేడు: స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతుల్లో ఖాళీ ఉన్న ఆరు సీట్లు భర్తీ చేసేందుకు బుధవారం గురుకుల పాఠశాలలో పరీక్ష నిర్వహించారు. పాఠశాల పరిధిలో నిర్వహించిన పరీక్షకు 104 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆరవ తరగతిలో 2, 7వ తరగతిలో 2, 8వ తరగతిలో 1, 9వ తరగతిలో 1 సీటు ఖాళీలను భర్తీ చేసేందుకు పరీక్ష నిర్వహించారు. మూడు గదుల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. చీఫ్ కే.ప్రసూన, వైస్ ప్రిన్సిపల్ వసుంధర పరీక్షలు నిర్వహించారు.

బుద్ధుని ప్రవచనం పుస్తకావిష్కరణ



బుద్ధుని ప్రవచనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: వేమన విజ్ఞాన కేంద్రం, దళిత సాహిత్య వికాస వేదిక సంయుక్త ఆధ్వర్యంలో పౌర హక్కుల ఉద్యమ నేత బొజ్జాతారకం 85వ జయంతిని పురస్కరించుకొని ఆయన రచించిన బుద్ధుని ప్రవచనం పుస్తకావిష్కరణ సభ యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో గురువారం సాయంత్రం నిర్వహించారు. రిపబ్లికన్ పార్టీ అధినేత పి.అంజయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత న్యాయమూర్తి పి.గుర్రప్ప, సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ, సీఐటీయూ నేత కందారపు మురళి, మల్లేశ్వరరావు, కవి గొడుగు చింత గోవిందయ్య, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున హాజరై బుద్ధుని ప్రవచనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొజ్జాతారకం సేవలను కొనియాడారు. రానున్న కాలంలో మేధావులు ప్రశ్నించడం మరింత పెరగాలని అందుకోసం వేమన విజ్ఞాన కేంద్రం, దళిత సాహిత్య వికాస వేదిక సంయుక్తంగా కృషి చేస్తాయని వక్తలు ఉద్ఘాటించారు.

వరుణ దేవా... కరుణించు

- ఖరీఫ్ సాగుకు సిద్ధంగా రైతులు
- ముఖం చాటేసిన వరుణుడు



విత్తనాలు విత్తుకోవడానికి సిద్ధంగా ఉన్న దుక్కులు

భాకరాపేట: వాన మబ్బులు కమ్ముకుంటున్నాయి. .. చిరుజల్లులు ఊరిస్తున్నాయి. వేసవి కాలం (ఎండాకాలం) వెళ్లిపోతోంది. అని అనుకున్నారు కానీ... కాని పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. వాన నీటి చుక్క నింగి నుంచి నేలకు జారడం లేదు. ప్రకృతి సహకరించకపోవడంతో వాతావరణంలో ఉక్కపోత తగ్గలేదు. ఏరువాక మొదలైనా... వానలు కోసం అన్నదాతలు ఎదురుచూస్తూనే ఉన్నారు. అదును దాటేలోగానే వర్షాలు కురవాలని రైతులు మొక్కని దేవుడు లేడు. సాధారణంగా జూన్ మొదటి వారంలో తొలకరి వర్షాలు కురుస్తాయి. ఈ వానలతో రైతులు విత్తనం విత్తుకునేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయి. రైతులు పనులలో నిమగ్నం అయిపోతారు. తరువాత జూలైలో పడే వానలు మొక్కల ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడతాయి. పది రోజుల క్రితం నుంచి మబ్బులు కనిపిస్తున్నా వాన జాడ లేకుండా పోతోంది. వర్షం కురవక పోవడంతో దుక్కులు దున్నిన రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు...

గతేడాది లోటు వర్షపాతం కారణంగా నియోజకవర్గంలో భూగర్భజలాలు అడుగంటాయి. గతేడాది కంటే ఈ సారి అధికంగా నీటి మట్టం తగ్గింది. ప్రస్తుతం నియోజకవర్గంలో భూగర్భ జలాల పరిస్థితి చూస్తుంటే భయం వేస్తుంది. ఎందుకంటే నియోజక వర్గంలో ఎక్కడ బోరు వేసినా 700 నుంచి 1000 అడుగులు వరకు నీటి ధార పైకి వచ్చే సూచనలు కనబడడం లేదు. లోతుకు నీటి మట్టం పడిపోవడం ఆందోళన కలిగించే విషయం. రానున్న వారం పది రోజుల్లో వర్షాలు కురవకపోతే సాగుకు కష్టకాలం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు వర్షాలు పడేదాకా వేచి చూడాలని చిన్నగొట్టిగల్లు ఏఓ ధనలక్ష్మీ సూచిస్తున్నారు. భూమిలో వేడి తగ్గక ముందే పంటల సాగు చేపడితే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. రానున్న కాలంలో వర్షాలు కురిస్తేనే ప్రయోజనం ఉంటుందన్నారు.

ప్రారంభం కాని సాగు

చంద్రగిరి నియోజకవర్గంలో జూన్ నెలలో సాగు చాలా వరకు ప్రారంభం అవుతుంది. అన్నదాతలు ఏరువాక పండుగ జరుపుకొన్నా వారి ముఖంలో ఆనందం లేకుండా పోతుంది. నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు దాదాపు 45 వేల హెక్టార్లలో ఉంటుంది. ఇందుకు తగ్గట్టుగా వ్యవసాయ శాఖ వేరుశనగ, వరి, జీలుగ, జిప్సం రాయితీపై రైతులకు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు ఆరు మండలాల పరిధిలో నీటి వనరులున్న ప్రాంతాల్లోనే సాగు ప్రారంభమైంది. వర్షాధార భూముల్లో దుక్కులు దున్ని సిద్ధం చేశారు. ఈ సారి చాలా మంది రైతులు మంచి ధర లభిస్తుందన్న ఆశతో మెట్ట ప్రాంతాల్లోనూ వేరుశనగ సాగు చేసేందుకు ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకున్నారు. ప్రస్తుతం వీరంతా వరుణుడి రాక కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యాధికారులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ డాక్టర్ సూర్యసాయి

చంద్రగిరి: సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీఓ డాక్టర్ సూర్యసాయి సూచించారు. గురువారం ఆయన కొటాల పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారులు, సిబ్బందితో సీజనల్ వ్యాధులను అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నీటి కలుషితం కారణంగా డయేరియా వేగంగా వ్యాపిస్తోందన్నారు. నీటి కాలుష్యాన్ని గుర్తించడంతోపాటు పైపు లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రతి పంచాయతీలోని వాటర్‌హెడ్ ట్యాంకులను శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం ద్వారా డయేరియాను అరికట్టవచ్చునని తెలిపారు. అదే విధంగా దోమల వలన విష జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు నీటి నిల్వలు లేకండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అదే విధంగా క్యాన్సర్‌పై అవగాహన, డెంగీ ఇతర వ్యాధులకు సంబంధించి ఆయన అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కుసుమ కుమారి, ఎంపీహెచ్ఈఓ ఈశ్వరయ్య, సిబ్బంది లలిత, వాసుదేవ, వెంకటేశ్వరరావు, అనిత, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు బడిలోనే ఉండాలి



చిన్నరామాపురంలో ర్యాలీ

చంద్రగిరి: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని మండల విద్యాశాఖ అధికారులు లలిత, భాస్కర్ బాబు తెలిపారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని చిన్నరామాపురం, ఎగువ కూచువారిపల్లి, బూడిదగట్టువారిపల్లి, మూలపల్లి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చదువుకునే వయసులో ఎవరు పనికి వెళ్లకూడదని, పిల్లలంతా చదువుకుని తమ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. చదువుకునే వయస్సులో పనులకు వెళ్లడం ద్వారా, పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిపోతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ పిల్లలను బడికి పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



బోధన సదస్సులో పాల్గొన్న వైద్య అధ్యాపకులు

తిరుపతి తుడా: శ్రీసాయి సుధా కంటి ఆసుపత్రిలో సుధారాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత గ్లకోమా వైద్య శిబిరం నిర్వహించారు. 50 మందికి పైగా రోగులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యపరమైన సూచనలు ఇచ్చారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ మధుమేహం ఉన్న వారిలో గ్లకోమా అనే నీటి కాసుల వ్యాధి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అలాంటప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలు రెటీనాలోని రక్తనాళాలను దెబ్బతీస్తాయని చెప్పారు. సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి సరైన చికిత్స తీసుకోవడంతో తీవ్ర సమస్యను అధిగమించవచ్చునన్నారు. నిర్లక్ష్యం చేస్తే పూర్తిగా దృష్టిని కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డయాబెటిస్ ఉన్నవారు ప్రతి 3 నెలలకు ఒకసారి తప్పనిసరిగా గ్లకోమా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

ఏర్పేడు: నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన మండలంలోని పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చరణ్‌దీశ్, హేమను గురువారం ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ అభినందించారు. 2023–24 విద్యా సంవత్సరంలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో అప్పటి 8వ తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. 4 ఏళ్లపాటు ఒక్కొక్క విద్యార్థికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్కొక్క ఏడాదికి రూ.12 వేలవంతున నగదును పొందనున్నట్లు వివరించారు. ప్రస్తుతం విద్యార్థులు పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటున్నారు. రెండు నెలలపాటు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు.

ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు అనివార్యం

శ్రీకాళహస్తి: భారతదేశం బలమైన ఆర్థిక శక్తిగా పురోగతి సాధించాలంటే ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు అవలంబించాల్సిన అవసరం చాలా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాలసుబ్రమణ్యం అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జరుగుతున్న సీపీఎం శాఖా కార్యదర్శుల రాజకీయ శిక్షణ తరగతులకు గురువారం ఆయన హాజరయ్యారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాల కారణంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అంబానీ, ఆదానీల కోసం విదేశాల నుంచి అనవసర దిగుమతులు తగ్గించాలని, నల్ల ధనాన్ని వెలికి తీయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై పరోక్ష పన్నుల మోతను అరికట్టాలని చెప్పారు. ఉపాధి హామీకి నిధుల పెంపు, నాణ్యమైన విద్య, వైద్యం అందించాలన్నారు. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి అయ్యేలా అధికార వికేంద్రీకరణ జరగాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, పట్టణ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, వెంకటేష్, మనోహర్, వెలివేంద్రం, కుప్పమ్మ, రాజా పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోండి

సత్యవేడు: ఆంధ్రా–తమిళనాడు సరిహద్దులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హస్సర్(35), నీలయ్య(50) రెండు కుటుంబాలకు తక్షణ సాయం అందించి ఆదుకోవాలని పోలీసులను బీసీ కాలనీ వాసులు, మృతుల బంధువులు బుధవారం స్థానిక మూడు రోడ్ల కూడలిలో రాస్తారోకో చేశారు. పోలీసులు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా పోలీసులు ఆందోళనకారులతో మాట్లాడారు. ప్రమాదానికి కారకులపై కేసు నమోదు చేశామని, లారీ సీజ్ చేశామన్నారు. ఆందోళనకారులు మాత్రం లారీ యాజమాన్యం నుంచి పరిహారం ఇప్పించాలని ఈసందర్భంగా డిమాండ్ చేశారు.

కేవీకేకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలను అందుకుంటున్న డాక్టర్ శ్రీనివాసులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి వనస్థలిలోని రాస్ కేవీకేకు భారతీయ వ్యవసాయ సాంకేతిక పరిశోధన, వినియోగసంస్థ నాలుగు విభాగాల్లో ఉత్తమ సేవలను అందించినందుకుగాను ప్రశంసాపత్రాలను అందుకున్నట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగిన జోన్–10 కేవీకేల వార్షిక జోనల్ సమావేశంలో వ్యవసాయ శాస్త్రజ్ఞులు, నిపుణులు, నాలుగు రాష్ట్రాల కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ముగింపు సమావేశంలో కరకంబాడికి చెందిన రాస్ కేవీకేకు జిల్లాలో భూసార పరీక్షలపై అవగాహన కల్పించి రైతులు అవలంబించేలా కృషిచేసినందుకు, నూనె గింజల పంటల్లో రైతుల ఆదాయం పెంచే దిశగా ప్రదర్శన క్షేత్రాలు, వ్యవసాయ యాంత్రీకరణ, ఉత్తమ వికశిత్ భారత్ సంకల్పయాత్ర విభాగాలలో జిలాల్లోని రైతులకు అత్యుత్తమ సేవలను అందించినందుకు గాను ప్రశంసాపత్రాలను అందించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు భారత వ్యవసాయ పరిశోధన, సాంకేతిక మండలి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసాపత్రాలను అందుకున్నారు. దీంతో కేవీకే శాస్త్రవేత్తలను రాస్ జనరల్ సెక్రటరీ వెంకటరత్నం అభినందించారు.